క్లుప్తంగా

ఉచితంగా వృత్తి శిక్షణ కోర్సులు

రాజంపేట : రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఉచిత వృత్తి శిక్షణ కోర్సులు నేర్పిస్తున్నట్టు స్కిల్ కాలేజ్ భారత్ ఎడ్యుకేషనల్ సొసైటీ రాజంపేట ఇన్‌చార్జి సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులు మూడు నెలల కాల పరిమితి ఉంటుందన్నారు. అలాగే విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. మొబైల్ అసెంబ్లీ సూపర్‌వైజరు, పేషంట్ రిలేషన్, సర్వీస్ ఇంజనీరు (ఐటీ, హార్డ్‌వేర్), సోలార్ ఫొటో వొలటిక్ కోర్సులను నేర్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం వారికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వివరాలకు 89192 38902, 75690 15301, 90104 33030 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

బాధ్యతల స్వీకరణ



హరిప్రసాద్ రెడ్డి

పెనగలూరు (ఓబుల వారిపల్లె) : పెనగలూరు మండల ఎంపీడీఓగా హరిప్రసాద్ రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. హరిప్రసాద్ రెడ్డి రాజంపేట మండలంలో ఈఓపీఆర్‌డీగా పని చేస్తూ ఎన్నికలలో భాగంగా పెనగలూరు మండలానికి ఎంపీడీఓగా బదిలీ అయ్యారు.

శరవేగంగా రోడ్డు పనులు



తారురోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

నందలూరు : మండలంలో తారురోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డిల ఆదేశాల మేరకు మండల కేంద్రం నుంచి పొన్నెల్లవాండ్లపల్లెకు రహదారి నిర్మాణ పనులను గుత్తేదారులు వెంకట్రామిరెడ్డి, స్థానిక నాయకులు నాగరాజు యాదవ్, వివి ప్రతాప్ రెడ్డిలు ప్రారంభించారు. 1.5 కిలోమీటరు రోడ్డు నిర్మాణానికి దాదాపు కోటి రూపాయల నిధులు కేటాయించారని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం ఎట్టకేలకు ప్రారంభం కావడంతో అంబేడ్కర్ కాలనీ, చెంచురెడ్డిగారిపల్లె, పొన్నెల్లవాండ్లపల్లె వాసులు హర్షం వ్యక్తం చేశారు.

నివాళి



పార్వతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని కడపాయపల్లె గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మాధు శివరామిరెడ్డి గారి తల్లి మాధు పార్వతమ్మ(68) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మంగళవారం సాయంత్రం కడపాయల్లె గ్రామానికి చేరుకొని పార్వతమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పార్వతమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎండీసీ అవుట్ సోర్సింగ్ ట్రైనీ కార్మిక పోరాట కమిటీ నాయకులు మంగళవారం సీపీఓ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగంపేట ఏపీఎండీసీలో 15 సంవత్సరాలు పైబడి పనిచేస్తున్న ట్రైనీ, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సంక్రాంతి పండుగ సందర్భంగా ఫెస్టివల్ అడ్వాన్సులు ఉద్యోగులకు అందించాలన్నారు. రెగ్యులర్ కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలని, ఈనెల 16న జరగనున్న జాతీయస్థాయి సమ్మెకు ఏపీఎండీసీ పోరాట కమిటీ నాయకులు మద్దతు తెలుపుతున్నట్లు వారు తెలిపారు. పోరాట కమిటీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రవాల్మీకి జయంతి

ఒంటిమిట్ట : కోదండ రామాలయం సమీపంలో శృంగశైలంపై వెలసిన ఆంధ్రవాల్మీకి వావికొలను సుబ్బారావు 161వ జయంతి వేడుకలు మంగళవారం టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కోదండ రామాలయ అర్చకులు శ్రవణ్ కుమార్, పవన్ కుమార్ స్వామి వారికి పంచామృతాభిషేకాలతో పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు వాసుదాసస్వామిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తాను పుట్టగోసితో టెంకాయ చిప్ప చేతబట్టి ఊరూరా తిరిగి సంపాదించిన కోట్లాది రూపాయలు, తాను రచించిన కావ్యాన్ని అవతార పురుషుడు అయిన కోదండ రామునికి అంకితం చేసిన మహానుభావుడు వావికొలను అని అధికారులు తెలియజేశారు. ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రాయచోటి అభివృద్ధి, సుందరీకరణే ధ్యేయం

- కొత్తపేట రామాపురం అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు

రాయచోటి అర్బన్ : రాయచోటి పట్టణ అభివృద్ధి, సుందరీకరణే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురం నాయీబ్రాహ్మణ కాలనీ, సత్యనారాయణపురంలో రూ. 79.19 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం, 15వ ఆర్థికసంఘం నిధులతో నిర్మించిన 5 సిమెంటు రోడ్లు ప్రారంభం, 2 సీసీ రోడ్ల పనుల భూమిపూజ కార్యక్రమ శిలాఫలకాల ఆవిష్కరణలో ఆయన మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డితో కలసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వంద పడకల ఆసుపత్రితోపాటు 4 పట్టణ ఆరోగ్యకేంద్రాలు, బస్టాండు విస్తరణ, డైట్ మున్సిపల్ పార్కు, రైతు బజార్, క్రికెట్ స్టేడియం, నగరవనం, శిల్పారామం తదితర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కొత్తపేట రామాపురం అభివృద్ధికి మరింత తోడ్పాటు అందిస్తామంటూ చెప్పారు. అనంతరం ఆయా వీధులలో శ్రీకాంత్‌రెడ్డి పర్యటించి ప్రజాసమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగ అంజలి, భాస్కర్, మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నేతలు పల్లపు రమేష్, కొలిమి హారూన్, ఆసిఫ్ అలీఖాన్, షబ్బీర్, రియాజ్, నరసింహారెడ్డి, శంకర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, హజరత్ ఖాదర్‌వలి, భూషణం, క్రిష్ణ, రవి,రామాంజి, మున్సిపల్ ఏఈ క్రిష్ణారెడ్డి, ఆర్ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా 'సీఎం సహాయనిధి'

పది మందికి రూ. 16.48 లక్షలు విలువచేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పదిమంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 16.48 లక్షలు విలువచేసే చెక్కులను ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థికంగా చితికిపోయిన వారికి ఆ ఇంటి పెద్దకొడుకుగా సీఎం జగన్ కొండంత అండగా నిలుస్తున్నారన్నారు. బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందన్నారు. రాయచోటి పట్టణంలోని నాదనా స్ట్రీట్‌కు చెందిన షేక్ రఫీవున్నీసాకు రూ. 50 వేలు, చౌడేశ్వరీ దేవాలయ ప్రాంతానికి చెందిన మద్దిశెట్టి జ్ఞానేశ్వర్‌కు రూ. 23వేలు, లక్కిరెడ్డిపల్లె మండల కేంద్రంలో షేక్ జబ్బిజాన్‌కు రూ. 1లక్ష, రామాపురం మండలంలోని సుద్దమళ్ల గ్రామం ఓబుల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన పి.నాగలక్ష్మమ్మకు రూ. 65 వేలు, గోపగుడిపల్లెకు చెందిన చాకిబండ భాస్కర్‌కు రూ. 1.50 లక్షలు, రాయచోటి రూరల్ మండలం ఎగువ అబ్బవరం కమ్మపల్లెకు చెందిన గండే లక్ష్మినరసమ్మకు రూ. 3.20 లక్షలు, గాలివీడు మండలం నూలివీడు గ్రామం ఆవులరెడ్డిగారి పల్లెకు చెందిన చింతంరెడ్డి లావణ్యకు రూ. 3.40 లక్షలు, అరవీడు గ్రామం ఎల్లంపల్లెకు చెందిన దేవరింటి రాజేశ్వరమ్మకు రూ. 1 లక్ష, సంబేపల్లె మండల పరిధిలోని మోటకట్ల గ్రామం చెరువుకిందపల్లెకు చెందిన కస్తూరికి రూ. 3 లక్షలు, రౌతుకుంట గ్రామం వంగిమళ్లవాండ్లపల్లెకు చెందిన నాగూరి అనీషకు రూ. 2 లక్షలు విలువచేసే చెక్కులను శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. ముఖ్యమంత్రి జగన్ సహకారాన్ని మరువలేమని సహాయనిధిని అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. తమకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్, ఎంతో సహకరించిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్ రెడ్డి, కౌన్సిలర్ సాదక్ అలీ, సర్పంచ్ ఉమాపతిరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మా అమరనాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ దాసరి చిన్నారెడ్డి, కో-ఆప్షన్ సయ్యద్ అమీర్, తిరుపాల్ నాయుడు, వసంత శ్రీనివాసులు రెడ్డి, ఎంపీటీసీ రఘు, సర్పంచ్ అమరనాథరెడ్డి, ఎంపీటీసీ కాకులపల్లె రమణారెడ్డి, లయన్ అశోక్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు : కోడూరు మండలంలో కొత్తగా నియమింపబడ్డ నలుగురు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు నియామక పత్రాలు అందించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు తగిన సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ తల్లి బిడ్డ సంక్షేమానికి, వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ కార్యక్రమాల ద్వారా వారి సామర్థ్యాన్ని పెంచేలా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా పౌష్టికాహారం అందించడంతో పాటు వారికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందుబాటులో తెచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీడీపీఓ సౌభాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి



నేకనాపురంలో మాట్లాడుతున్న సీఐ పురుషోత్తంరాజు

సిద్దవటం : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎవరి ఓటు వారు నిర్భయంగా వినియోగించుకోవాలని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. సిద్దవటం మండలంలోని నేకనాపురం గ్రామంలో సోమవారం రాత్రి సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు ప్రజలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పురుషోత్తం రాజు మాట్లాడుతూ జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఘర్షణలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గ్రామాల్లోని ప్రశాంతతను దెబ్బతినేలా చేస్తే కేసులు నమోదుతోపాటు బైండోవర్ చేస్తామన్నారు. ఎన్నికలను సజావుగా జరిగేందుకు పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాల్లో నిఘా ఉంచి అసాంఘిక శక్తుల చేష్టలను ఎండగడతామన్నారు. కార్యక్రమంలో సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్న, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రాజు, స్థానిక సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అవివేకంతోనే సీఎం జగన్‌పై జంగా విమర్శలు



మాట్లాడుతున్న భాస్కర్‌యాదవ్

రాజంపేట : జంగా కృష్ణమూర్తి టీడీపీ ప్రలోభాలకు లొంగి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తే సహించేదిలేదని రాజంపేట నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఇక్కడి విలేకర్లతో మాట్లాడుతూ టికెట్ ఇవ్వలేనంత మాత్రాన జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం అవివేకమన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించే విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. 2014లో టికెట్ ఇచ్చారు కానీ, మీరు ఓడిపోయారన్నారు. అయినా ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేశారు. బీసీలకు ఏమి చేయాలో అవన్నీ చేసిన సీఎం ఎవరైనా ఉన్నారంటే అది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినేనని అన్నారు. యాదవులకు ముఖ్యమంత్రి అన్ని విధాలుగా ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జంగాకు బీసీ నేతగా రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక గుర్తింపునిచ్చిన సీఎం జగన్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. జంగా ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. జంగా తీరుపై యాదవులు సైతం పెదవి విరిస్తున్నారన్నారు.

పెన్షనర్ల భవన్‌కు స్థలం కేటాయించండి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న విశ్రాంతి ఉద్యోగులు

రాయచోటి టౌన్ : జిల్లా కేంద్రం అయిన రాయచోటిలో విశ్రాంతి ఉద్యోగులు ఒకే చోట కలిసేందుకు 5 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని అన్నమయ్య జిల్లా పరిసర ప్రాంతాలకు చెందిన పెన్షనర్లు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలసి సన్మానించారు. అనంతరం వారు వినతిపత్రాన్ని అందజేశారు. తామంతా జిల్లా వ్యాప్తంగా మొత్తం 1753 మంది ఉన్నామని, జిల్లా నలుదిక్కుల నుంచి రాయచోటిలోని ఆస్పత్రులకు వైద్యం కోసం, పాత మిత్రులతో కలిసి మా కష్ట సుఖాలు పంచుకోవడం కోసం ఒక ప్రదేశం కూడా లేదని తెలిపారు. పట్టణానికి దగ్గరగా ఎక్కడైనా ఖాళీ జాగా ఉంటే స్థలం కేటాయించాలని కోరారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మోసాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

చిన్నమండెం : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిన్నమండెం ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం బోనమల, మల్లూరు గ్రామ పంచాయతీలలో ఎస్ఐ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం సైబర్ క్రైం మోసాలు పెరిగిపోయాయని, ముఖ్యంగా యువత ఆన్‌లైన్ యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం అందజేత

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని లక్కిరెడ్డిపల్లె ఏరియా ఆసుపత్రి పరిధిలో ఉండే టీబీ (క్షయ)వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు పంపిణీ చేసినట్లు టీబీ సూపర్‌వైజర్ హరి తెలిపారు. పవర్ గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో ఆరు నెలలకు సరిపడా పోషకాహారాన్ని క్షయ వ్యాధిగ్రస్తులకు ఆసుపత్రి వైద్యులు ధరణి, రెడ్డి కిరణ్, సులోచన, జీవన్‌ల చేతులమీదుగా అందజేశారు. క్షయ వ్యాధిగ్రస్తులు న్యూట్రీషన్ ఫుడ్ క్రమం తప్పకుండా తీసుకోవడంతోపాటు మందులు సకాలంలో వాడితే వ్యాధిని నిర్మూలించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

రాయచోటి టౌన్ : వీరబల్లె మండల కేంద్రానికి చెందిన ఓ గర్భిణీకి అత్యవసరంగా మూడు ప్యాకెట్లు రక్తం కావాలని కోరడంతో వెంటనే స్పందించి ముగ్గురు యువకుల ద్వారా రక్తాన్ని అందించినట్లు సంఘ సేవకుడు డాక్టర్ మైనుద్దీన్ అందించారు. మంగళవారం గర్భిణీ వైద్యం కోసం ఒక ప్రైవేట్ ఆస్పత్రికి రాగా వైద్యులు చికిత్స అవసరమని అందుకు రక్తం మూడు యూనిట్లు కావాలని సూచించడంతో ఆమె బంధువులు వీరిని కోరడంతో వెంటనే స్పందించి తన మిత్ర బృందంలోని ఫహద్, బాబ్జి, అశోక్‌ల ద్వారా రక్తదానం చేయించారు.

రెండిళ్లలో చోరీ

రూ.10 లక్షల వరకు నగదు, నగలు చోరీ

రాజంపేట : రాజంపేట – రాయచోటి రహదారిలో ఉన్న కూచివారిపల్లె గ్రామంలో నివసిస్తున్న బాబునాయుడు ఇంటిలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. ఇంటి యజమానులు పట్టణంలో సరుకులు కొనుగోలుకు వెళ్లారు. ఇంటి తాళం వేసి ఉండటం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంటిలో ఉన్న 150 గ్రాములు బంగారు, రూ.1 లక్ష నగదును దోచుకెళ్లారు. రెడ్డిప్రసాద్ ఇంటిలో రెండు జతల కమ్మలు, మాటీలు రెండు, ఉంగరాలు రెండు, రూ.7వేల నగదు చోరీ చేశారు. ఈ రెండు ఇళ్లలో కలిసి రూ.10 లక్షల విలువ చేసే నగలు, నగదు దోపిడీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన బోధన అందించాలి

చిన్నమండెం : విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఏపీ మోడల్ స్కూల్స్ జిల్లా ఇంచార్జ్ స్పెషల్ ఆఫీసర్, జిల్లా దేవాదాయ శాఖాధికారి విశ్వనాథ్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదుల్లోని ఎల్‌ఈడీ బోర్డులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అదే విధంగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వంట సరుకులను స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. అనంతరం మండెం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అంకితభావంతో సేవలు

- పాత ఆస్పత్రి భవనం ఆధునికీకరణకు మరో రూ. 25లక్షలు
- 1000కి చేరిన ప్రభుత్వాసుపత్రి రోగుల ఓపీ సంఖ్య



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్

రాయచోటి టౌన్ : రోగులకు అంకితభావంతో వైద్య సేవలు అందిస్తున్నామని రాయచోటి డీసీహెచ్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్ తెలిపారు. మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త భవనం నిర్మించిన తరువాత ఓపీ పెరిగిందన్నారు. పాత భవనంలో నుంచి కొత్త భవనంలోకి వచ్చి సుమారు 35 రోజులు అవుతోందని తెలిపారు. అప్పటి నుంచి అన్ని విభాగాలు నుంచి ఓపీ పెరుగుతోందని చెప్పారు. గతంలో 600 వరకు ఉన్న ఓపీ ప్రస్తుతం 1000కి చేరిందన్నారు. అలాగే పాత భవనం అధునీకికరించేందుకు ప్రభుత్వం రూ.25లక్షలు మంజూరు చేసిందన్నారు. త్వరలో అది కూడా ఆధునికీకరిస్తామని తెలిపారు. కొత్త భవనంలోకి డయాలసిస్ విభాగాన్ని తరలిస్తామన్నారు. ఓపీ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని తరువాత ఎమర్జెన్సీ, ఇతరా వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ల్యాబ్ ద్వారా రక్త పరీక్షలు గత నెలలో 15,300 వరకు వచ్చాయన్నారన్నారు. గతంలో 50 పడకల ఆస్పత్రిగా ఉండేదని కానీ 100 పడకల ఆస్పత్రిగా మారిన తరువాత అందుకు తగిన విధంగా పరికరాలు పూర్తి స్థాయిలో లేనందున కావాల్సిన పరికరాలు కోసం నివేదికలు పంపామని త్వరలో అవి కూడా వస్తాయని తెలిపారు. కొత్త భవనంలోని అన్ని గదులు అందుబాటులో వస్తే ఆపరేషన్ల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది మొత్తం 85 మంది ఉన్నారని ఈఎన్‌టీ వైద్యుడు లేరని త్వరలో ఆ కొరత కూడా తీరుతుందని చెప్పారు. రాయచోటి ప్రాంతంలోని ప్రజలు వైద్య సేవలను సద్వినియోగంచేసుకోవాలని కోరారు. అన్ని విభాగాలకు చెందిన వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీసీహెచ్ డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి

రాయచోటి అర్బన్ : ఈనెల 16న నిర్వహింప తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రైతుల పంటలకు గిట్టుబాటు ధరను కల్పించే చట్టాన్ని వెంటనే చేయాలన్నారు. కార్మికులందరికి కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజుల పనిదినాలను పెంచడంతోపాటు రోజుకు రూ. 600లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా పంట రుణాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. 16న జరిగే గ్రామీణభారత్ బంద్‌లో రైతులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలంటూ కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు పీఎల్ నరసింహులు, నేతలు గాలిచంద్ర, గంగాధర్, సలీంబాషా, ఎంఎస్ రాయుడు, లీలావతి, నాగేశ్వరి, సరోజనమ్మ, వేణుగోపాల్‌రెడ్డి, మురళి, సురేష్, దేవ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ప్రోత్సాహంతోనే రాజకీయాల్లోకి



కనకదుర్గమ్మ ఆలయంలో రాజ్యసభ అభ్యర్థి మేడా రఘునాథరెడ్డి

రాజంపేట : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతోనే రాజకీయాల్లోకి వచ్చానని రాజ్యసభ అభ్యర్థి మేడా రఘునాథరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తాను నిరంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల కోసం పని చేస్తానన్నారు. మళ్లీ జగనన్న సీఎం కావాలని విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశానన్నారు. ప్రజలు ఆశీస్సులతోపాటు అమ్మవారి ఆశీస్సులు సీఎం వైఎస్ జగన్‌కు కలగాలని కోరుకున్నట్లు వివరించారు. 2018, 2020లో సీఎం వైఎస్ జగన్ రాజ్యసభ సీటు ఇస్తానని చెప్పారన్నారు. కానీ పలు కారణాల రీత్యా పదవి తీసుకోలేదన్నారు. అయితే ఈసారి తప్పకుండా రాజకీయాల్లో ముందుకు రావాలని సీఎం సూచించడంతో రాజ్యసభ ఎంపీగా నామినేషన్ వేశానన్నారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాబట్టడంలో వైవీసుబ్బారెడ్డితో కలిసి పనిచేస్తానన్నారు. ఆయన వెంట పీసీయోగీశ్వరరెడ్డి, అన్నం నాగేంద్ర, ఒంటిమిట్ట తేజ, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

రాయచోటి టౌన్ : 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి జిల్లా పేరు ప్రతిష్టతలు తీసుకరావాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నమయ్య జిల్లా నూతన జిల్లా విద్యాశాఖాధికారులు శివప్రకాష్‌రెడ్డికి సూచించారు. మంగళవారం డీఈఓగా బాధ్యతలు చేపట్టిన శివప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యను అందించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపే విధంగా ప్రభుత్వ పాఠశాలలు పటిష్టపరచాలని తెలియజేశారు.